

# బోనాల వేళ ఆకతాయిల ఆటకట్టు

**షీటీమ్స్ ప్రత్యేక నిఘా.. 678 మంది ఈవ్‌టీజర్ల గుర్తింపు**

**25 మందికి జైలు.. పలువురికి జరిమానాలు, సామాజిక సేవ శిక్షలు**

**హైదరాబాద్, ఆగస్టు 6:** బోనాల ఉత్సవాల సందర్భంగా మహిళల భద్రతకు భంగం కలిగించే ఆకతాయిలపై షీటీమ్స్ ఉక్కుపాదం మోపాయి. దేవాలయాల వద్ద మహిళలను వేధింపులకు గురిచేసిన ఘటనలపై ప్రత్యేక నిఘా చేపట్టి మొత్తం 678 మంది ఈవ్‌టీజర్లను గుర్తించాయి. మహిళల నుంచి అందిన ఫిర్యాదులు, సీసీటీవీ దృశ్యాలు, వీడియో ఆధారాల సహాయంతో నిందితులను గుర్తించిన షీటీమ్స్, వారిపై కేసులు నమోదు చేశాయి. విచారణ అనంతరం నిందితులను కోర్టులో హాజరుపరచగా పలువురికి శిక్షలు విధించారు. న్యాయస్థానం 25 మందికి జైలు శిక్షతో పాటు జరిమానా, మరో 11 మందికి మూడు రోజుల జైలు శిక్షతో పాటు రూ.1,050 జరిమానా విధించింది. అదనంగా 26 మందికి రూ.1,050 చొప్పున జరిమానా విధిస్తూ సామాజిక సేవ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం, వేధింపులకు పాల్పడడం వంటి చర్యలను ఏమాత్రం సహించబోమని పోలీసులు స్పష్టం చేశారు. మహిళల భద్రతకు భంగం కలిగించే వారిపై భవిష్యత్తులోనూ కఠిన చట్టపరమైన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు.

# తరగతి గదిలో పాముకాటు

**మూడో తరగతి విద్యార్థి మృతి.. పాఠశాలలోనే విషాదం..**

**భద్రతా లోపాలపై ఆవేదన వ్యక్తం చేసిన తల్లిదండ్రులు**




**నారాయణపేట, ఆగస్టు 6:** నారాయణపేట జిల్లాలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో విషాద ఘటన చోటుచేసుకుంది. తరగతి గదిలో చదువుకుంటున్న ఎనిమిదేళ్ల విద్యార్థిని పాము కాటేయడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన నారాయణపేట మండలం ఎక్లాస్‌పూర్ గ్రామంలో జరిగింది. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న పిచ్చికుంట్ల రంజిత్ (8) బుధవారం తరగతి గదిలో ఉండగా ఒక్కసారిగా పాము కాటుకు గురయ్యాడు. విషయం తెలుసుకున్న ఉపాధ్యాయులు, గ్రామస్థులు వెంటనే బాలుడిని నారాయణపేట జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు అత్యవసర చికిత్స అందించినప్పటికీ, పరిస్థితి విషమించడంతో రంజిత్ ప్రాణాలు కోల్పోయాడు. చిన్నారి మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. పాఠశాల ఆవరణలో పారిశుద్ధ్య లోపాలు, పొదలు, చెత్త పేరుకుపోవడం వల్లే పాములు సంచరిస్తున్నాయని తల్లిదండ్రులు, గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భద్రతకు తగిన చర్యలు తీసుకోవడంలో అధికారులు నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. ఈ ఘటనపై సంబంధిత అధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పాములు, విషపురుగులు ప్రవేశించకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఇకపై ఇలాంటి విషాదాలు పునరావృతం కాకుండా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో భద్రతా ప్రమాణాలను కట్టుదిట్టం చేయాలని కోరుతున్నారు.

## ఉమెన్ సేఫ్టీ వింగ్ కస్టడీలో

# ఉదయ్ కృష్ణారెడ్డి

**ట్రైనీ ఐపీఎస్‌ను ప్రశ్నిస్తున్న పోలీసులు**

**నేటితో ముగియనున్న పోలీస్ కస్టడీ**



**హైదరాబాద్, ఆగస్ట్ 6:** ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డిని ఉమెన్ సేఫ్టీ వింగ్ అధికారులు కస్టడీలోకి తీసుకుని విచారిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం ఐదున్నర గంటల వరకు కస్టడీ కొనసాగనుంది. అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఉమెన్ సేఫ్టీ డీసీపీ లావణ్య నాయక్ ఆధ్వర్యంలో విచారణ జరుగుతోంది. ఈ నేపథ్యంలో డీసీపీ .. అత్తాపూర్ పీఎస్‌కు చేరుకున్నారు. కృష్ణారెడ్డిని డీసీపీ పర్యవేక్షణలో సీఐ జ్యోత్స్న విచారిస్తున్నారు. కస్టడీలో కొత్త విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. విచారణలో కీలక ఆధారాలు సేకరించే దిశగా పోలీసులు దృష్టి సారించారు. ప్రధానంగా మిస్సైన మొబైల్ ఫోన్‌పై పోలీసులు ఫోకస్ పెట్టారు. ఉదయ్ కృష్ణారెడ్డి రెండో మొబైల్ పైన ఆరా తీస్తున్నారు. మిస్సైన రెండో మొబైల్ దొరికినట్లయితే మరికొన్ని కీలక అంశాలు బయటపడే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే ఉదయ్‌కు సంబంధించిన ల్యాప్‌టాప్, మొబైల్ ఫోన్‌ను పోలీసులు సీజ్ చేసి ఎఫ్ఎస్ఎల్‌కు పంపించారు. హైదరాబాద్‌లోని జాతీయ పోలీస్ అకాడమీలో మహిళా ట్రైనీ ఐపీఎస్‌పై లైంగిక వేధింపుల కేసులో ఉదయ్ కృష్ణారెడ్డిని గత నెల 28న పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. వారం రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలంటూ ఉమెన్స్ సేఫ్టీ వింగ్ అధికారులు ఉప్పరపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా.. రెండు రోజుల పాటు కస్టడీకి న్యాయస్థానం అనుమతిచ్చింది. ఈ నేపథ్యంలోనే ఉదయ్ కృష్ణారెడ్డిని కస్టడీకి తీసుకుని విచారిస్తున్నారు. మహిళా ట్రైనీ ఐపీఎస్‌తో పరిచయం, లైంగిక వేధింపులు, తదితర అంశాలపై పోలీసుల విచారణ కొనసాగనుంది.

# ఒకే వ్యవస్థలో రోడ్ల నిర్వహణ

**హైదరాబాద్ రోడ్ నెట్‌వర్క్‌పై సీఎం కీలక ఆదేశాలు**

- డిసెంబర్ 9లోగా తొలి రేడియల్ రోడ్ పూర్తి చేయాలని నిర్దేశం
- భూసేకరణ వేగవంతం.. నాణ్యతలో రాజీ లేదన్న సీఎం



**హైదరాబాద్, ఆగస్టు 6:** ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు హైదరాబాద్, హెచ్ఎండీఏ పరిధిలోని రోడ్ల నిర్మాణం, నిర్వహణ, విస్తరణకు సంబంధించిన అన్ని పనులను ఒకే వ్యవస్థ పరిధిలోకి తీసుకురావాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎంసీఆర్ హెచ్ఆర్డీలోని బోధి పెవిలియన్‌లో హెచ్ఎండీఏ, హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన కీలక సూచనలు చేశారు. ఔటర్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్‌రోడ్, నగరంలోని ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, ప్రధాన రహదారుల నిర్మాణం, భూసేకరణ, రుణాల సమీకరణ, నిర్వహణ వంటి అన్ని అంశాలను సమన్వయంతో నిర్వహించేలా ఒకే వ్యవస్థను ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. ఔటర్ రింగ్ రోడ్ నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా ప్రమాదాలు పెరుగుతున్నాయని పేర్కొంటూ, రహదారిపై ఎక్కడికక్కడ వాహనాలు నిలిపివేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని అధికారులను ఆదేశించారు. రేడియల్ రోడ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, కొంగరకలాన్ నుంచి ఫ్యూచర్ సిటీ వరకు నిర్మిస్తున్న రేడియల్ రోడ్–1ను డిసెంబర్ 9 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టాలని స్పష్టం చేశారు. నిర్మాణంలో ఎదురయ్యే అడ్డంకులను వెంటనే తొలగించాలని, పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని పేర్కొన్నారు. రోడ్లకు ఇరువైపులా విస్తృతంగా హరితవనం అభివృద్ధి చేయాలని, బుద్వేల్ ట్రంపెట్ ఇంటర్‌చేంజ్ నిర్మాణం, బంజారాహిల్స్ నుంచి శిల్పా లేఅవుట్ వరకు ప్రతిపాదించిన ఎలివేటెడ్ కారిడార్ పనులను త్వరగా ప్రారంభించాలని ఆదేశించారు. హైదరాబాద్ భవిష్యత్ అభివృద్ధి రోడ్ల విస్తరణపై ఆధారపడి ఉందని పేర్కొన్న సీఎం, భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని, ఈ విషయంలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించరాదని స్పష్టం చేశారు. ల్యాండ్ పూలింగ్ ప్రక్రియలో మధ్యవర్తుల జోక్యానికి అవకాశం ఉండకూడదని, టీడీఆర్‌ల జారీ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

## ప్రొఫె'సర్'కు నివాళి

- ప్రొఫెసర్ జయశంకర్ సేవలు చిరస్మరణీయం

**హైదరాబాద్, ఆగస్టు 6:** తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఘన నివాళులర్పించారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించిన ముఖ్యమంత్రి, తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమానికి ప్రొఫెసర్ జయశంకర్ సిద్ధాంత బలాన్ని అందించిన మహనీయుడని కొనియాడారు. ప్రత్యేక తెలంగాణ సాధన కోసం జీవితాంతం అహర్నిశలు శ్రమించిన గొప్ప మేధావిగా ఆయన చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ చూపిన మార్గంలో ముందుకు సాగుతూ, ఆయన ఆశయాల సాధనకు ప్రజా ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ అభివృద్ధి, సామాజిక న్యాయం, ప్రజా సంక్షేమమే జయశంకర్ ఆశయాలకు నిజమైన నివాళిగా నిలుస్తాయని పేర్కొన్నారు.

# సింగరేణి చరిత్రలో స్వర్ణాధ్యాయం

- ఒడిశా నైనీ గని నుంచి తొలిసారి తెలంగాణకు బొగ్గు
- జైపూర్ థర్మల్ కేంద్రానికి చేరిన 4 వేల టన్నుల జీ-10 గ్రేడ్ బొగ్గు
- విద్యుత్ రంగానికి కొత్త ఊపు.. చారిత్రక ఘట్టమన్న భట్టి విక్రమార్క



**మంచిర్యాల, ఆగస్టు 6:** సింగరేణి చరిత్రలో మరో కీలక మైలురాయి నమోదైంది. ఒడిశాలోని నైనీ బొగ్గు గని నుంచి ఉత్పత్తి చేసిన తొలి బొగ్గు రైలు తెలంగాణలోని మంచిర్యాల జిల్లా జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌కు చేరుకుంది. 136 ఏళ్ల సింగరేణి చరిత్రలో రాష్ట్రం వెలుపల ఉన్న సొంత గని నుంచి బొగ్గు ఉత్పత్తి చేసి, తెలంగాణలోని విద్యుత్ కేంద్రానికి తరలించడం ఇదే తొలిసారి కావడం విశేషం. 59 రైల్వే వ్యాగన్లలో సుమారు 4 వేల టన్నుల జీ–10 గ్రేడ్ నాణ్యమైన బొగ్గు జైపూర్ థర్మల్ కేంద్రానికి చేరుకోగా, సింగరేణి అధికారులు ఘన స్వాగతం పలికారు. ఈ చారిత్రక ఘట్టంపై ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క హర్షం వ్యక్తం చేస్తూ సింగరేణి యాజమాన్యం, కార్మికులకు అభినందనలు తెలిపారు. తెలంగాణలో విద్యుత్ కొరత లేకుండా ప్రభుత్వం సమగ్ర చర్యలు తీసుకుంటోందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. నైనీ గని నుంచి బొగ్గు రాకతో సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌కు ఇంధన సరఫరా మరింత బలోపేతమవుతుందని, భవిష్యత్తులో కొత్త బొగ్గు గనుల సాధనకు కూడా ప్రయత్నాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. నైనీ బొగ్గు గని అభివృద్ధి కోసం అనుమతుల సాధనలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపిందని అధికారులు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్వయంగా రెండుసార్లు ఒడిశా వెళ్లి అక్కడి ముఖ్యమంత్రి, ఉన్నతాధికారులతో చర్చలు జరపడంతో అనుమతుల ప్రక్రియ వేగవంతమైందని వెల్లడించారు. 2025 ఏప్రిల్ 16న నైనీ గనిలో బొగ్గు ఉత్పత్తిని వర్చువల్‌గా ప్రారంభించిన అనంతరం, అక్కడి నుంచి బయలుదేరిన తొలి రైలు 1,131 కిలోమీటర్లు ప్రయాణించి తెలంగాణకు చేరుకుంది. కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ 2015లో సింగరేణికి కేటాయించిన నైనీ గనిలో 340.78 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నట్లు అంచనా. ఈ గని జీవితకాలం 36 సంవత్సరాలు కాగా, సంవత్సరానికి కోటి టన్నుల బొగ్గు ఉత్పత్తి సామర్థ్యం కలిగి ఉంది. నాణ్యమైన బొగ్గు అందుబాటులోకి రావడంతో సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రానికి ఇంధన భద్రత మరింత బలోపేతం కానుందని, రాష్ట్రంలో నిరంతర విద్యుత్ సరఫరాకు ఇది కీలక మద్దతు అందించనుందని ప్రభుత్వం భావిస్తోంది. సింగరేణి కీర్తి కిరీటంలో నైనీ గని మరో చారిత్రక అధ్యాయంగా నిలిచిపోతుందని అధికారులు పేర్కొన్నారు.

# ఆగస్టు 15 నుంచే కొత్త ఆసరా పింఛన్లు

**అర్హులందరికీ పింఛన్ అందిస్తాం: మంత్రి పొంగులేటి**

**త్వరలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు.. భూ భారతి ద్వారా డిజిటల్ హక్కు పత్రాలు**

**పేదలకు ఎలాంటి అన్యాయం జరగనివ్వమని హామీ**



**ఖమ్మం, ఆగస్టు 6:** స్వాతంత్ర్య దినోత్సవమైన ఆగస్టు 15 నుంచి కొత్తగా దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆసరా పింఛన్ల పంపిణీ ప్రారంభిస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీ గుదిమళ్లలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అర్హులైన ఏ ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు దూరం కాకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం వృద్ధులు, వితంతువులు, నేత కార్మికులు, కల్లు గీత కార్మికులు, బీడీ కార్మికులు, ఒంటరి మహిళలు, ఎయిడ్స్ బాధితులకు నెలకు రూ.2,016 చొప్పున, దివ్యాంగులు, తీవ్రమైన శారీరక వైకల్యం ఉన్న వారికి రూ.4,016 చొప్పున ఆసరా పింఛన్ అందజేస్తోందని మంత్రి తెలిపారు. ఫైలేరియా బాధితులకు కూడా నెలకు రూ.2,016 ఆర్థిక సాయం అందిస్తున్నట్లు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర భూ సర్వే చేపట్టి 'భూ భారతి' కార్యక్రమం ద్వారా డిజిటల్ మ్యాప్‌తో కూడిన భూమి హక్కు పత్రాలను లబ్ధిదారులకు అందజేస్తామని మంత్రి వెల్లడించారు. అనర్హుల పేర్లపై ఉన్న పట్టాదారు పాస్‌పుస్తకాలను రద్దు చేసి, నిజమైన హక్కుదారులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియను మరో రెండు మూడు రోజుల్లో ప్రారంభిస్తామని వెల్లడించిన మంత్రి, అర్హులైన లబ్ధిదారులకు పారదర్శకంగా ఇళ్లను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే రాబోయే తొలి పంటకే సాగునీరు అందేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

# కొత్త తెల్ల రేషన్ కార్డులకు ముహూర్తం ఖరారు

- ఆగస్టు 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ
- 1.05 కోట్ల ల్యామినేటెడ్ కార్డులు అర్హులకు
- సంగారెడ్డిలో సీఎం చేతుల మీదుగా ప్రారంభం



**హైదరాబాద్, ఆగస్టు 6:** తెలంగాణలో కొత్త తెల్ల రేషన్ కార్డుల పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం ముహూర్తం ఖరారు చేసింది. స్వాతంత్ర్య దినోత్సవమైన ఆగస్టు 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఆహార భద్రతను విస్తరించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1.05 కోట్ల కొత్త ల్యామినేటెడ్ రేషన్ కార్డులను అర్హులకు అందజేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. సంగారెడ్డి జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనుండగా, అదే సమయంలో రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒకేసారి పంపిణీ కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రేషన్ కార్డుల పంపిణీ నిర్వహించనున్నారు. కార్యక్రమం సజావుగా సాగేందుకు ప్రతి నియోజకవర్గంలో పర్యవేక్షణ బాధ్యతలను ఆర్డీవోలకు అప్పగించినట్లు ప్రభుత్వం తెలిపింది. స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల సమక్షంలో పంపిణీ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కార్డులు తీసుకునేందుకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, కూర్చునే ఏర్పాట్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పంపిణీ పూర్తయిన వెంటనే ప్రతి నియోజకవర్గం నుంచి సమగ్ర నివేదికలను ప్రభుత్వానికి సమర్పించాలని కూడా స్పష్టం చేశారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, "అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఏ ఒక్క అర్హుడు కూడా ఈ పథకానికి దూరం కాకుండా పంపిణీ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తాం" అని తెలిపారు.

# నీలిపల్లి గ్రామ ప్రజల న్యాయమైన డిమాండ్




**సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల :** నీలిపల్లి గ్రామంలోకి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ ఈరోజు గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు మరియు గ్రామ ప్రజలందరం కలిసి శాంతియుత ధర్నా నిర్వహిస్తున్నాము.

ప్రతిరోజూ విద్యార్థులు గ్రామం బయట ఉన్న స్టేజి వరకు వెళ్లి బస్సు ఎక్కాల్సిన పరిస్థితి ఉంది. చిన్నపిల్లలు, బాలికలు ఎండ, వర్షంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఇది రాజకీయ కార్యక్రమం కాదు. మా గ్రామ విద్యార్థుల విద్యా హక్కు, భద్రత మరియు భవిష్యత్తు కోసం చేస్తున్న న్యాయమైన విజ్ఞప్తి. ఆర్టీసీ అధికారులు వెంటనే స్పందించి నీలిపల్లి గ్రామంలోకి బస్సు సౌకర్యం కల్పించాలి.

మా గ్రామ ప్రజల తరఫున డిమాండ్ చేస్తున్నాము.

నీలిపల్లి గ్రామ ప్రజల తరఫున

గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు మరియు గ్రామ ప్రజలు పాల్గొనారు

## ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ జయంతి సందర్భంగా ఘన నివాళులర్పించిన బోథ్ ఎమ్మెల్యే శ్రీ అనిల్ జాదవ్



**నేరడిగొండ సి కె న్యూస్..**తెలంగాణ రాష్ట్ర సాధన సిద్ధాంతకర్త, మహోన్నత మేధావి, ఉద్యమ తాత్వికుడు ఆచార్య ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ జయంతి సందర్భంగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి జయశంకర్ సార్ అందించిన సిద్ధాంతపరమైన మార్గదర్శకత్వం, జీవితాంతం చేసిన త్యాగం, ఉద్యమానికి ఇచ్చిన దిశ తెలంగాణ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. ప్రత్యేక తెలంగాణ కోసం ఆయన కలలు కన్న స్వప్నాన్ని భారత రాష్ట్ర సమితి వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీ కె. చంద్రశేఖర్ రావు (కేసీఆర్) గారి నాయకత్వంలో సాకారం చేశారని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడే దిశగా జయశంకర్ సార్ చూపిన మార్గంలోనే బీఆర్ఎస్ పార్టీ నిరంతరం ముందుకు సాగుతుందని, ఆయన ఆశయాల సాధనే నిజమైన నివాళి అని ఎమ్మెల్యే తెలిపారు.

ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం అధ్యక్షులు స్వామి, మాజీ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, సర్పంచులు సుధీర్ రెడ్డి, రాజు, రవీందర్, బాబులాల్, సంజీవ్, మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎలుక రాజు, విడిసి చైర్మన్ పోతన్న, మెడిచేల్మా ప్రవీణ్, రమణ రెడ్డి, బత్తుల రమేష్, సంజీవ్, సందీప్, సుజీల్ తో పాటు ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## .ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్త, ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ గారి జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించిన ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు డా. నరేష్ జాదవ్ గారు.



**గుడియాత్నూరు సి కె న్యూస...**ఈరోజు గుడిహత్నూర్ మండలం తోషం గ్రామంలో ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ గారి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన డీసీసీ అధ్యక్షులు డా. నరేష్ జాదవ్ గారు.

ఈ సందర్భంగా ప్రొఫెసర్ జయశంకర్ గారు తెలంగాణ సాధన కోసం చేసిన విశిష్ట సేవలను స్మరించుకుంటూ, వారి ఆశయాలను భావితరాలకు చేరవేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని డా. నరేష్ జాదవ్ గారు పేర్కొన్నారు. తెలంగాణ ఆత్మగౌరవం కోసం ఆయన చేసిన త్యాగాలు, ఉద్యమ స్ఫూర్తి చిరస్మరణీయమని కొనియాడారు.

ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల.నర్సయ్య మాజీ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు
సాజిద్ ఖాన్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్
అల్లూరి.సంజీవరెడ్డి జిల్లా కాంగ్రెస్ రాజ మెంబెర్
ఏలేటి.అశ్విన్ రెడ్డి టిపిసిసి ఎస్సీ సెల్ రాష్ట్ర వైస్
దుర్గం. శేఖర్ ,జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు
సుధాగోని.సుధాకర్ గౌడ్,జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి
మల్యాల.కరుణాకర్,బండి.దేవి దాస్ చారి,జిల్లా కాంగ్రెస్ ఓబీసీ సెల్ చైర్మన్ ,అంబకంటి.అశోక్ జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ,కోలట్కర్.పరమేశ్వర్ ,బోథ్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు
అల్లూరి.ప్రఫుల్ చందర్ రెడ్డి టీటీడీ మాజీ బోర్డు మెంబర్ ,
బెజ్జంకి.అనిల్ కుమార్ మాజీ జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షులు,భూపెల్లి. శ్రీధర్ మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ,తొడసం.దౌలత్ రావ్ కళ్ళెం.విట్టల్,మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ,జల్కే.పాండురంగ జిల్లా సీనియర్ కాంగ్రెస్ నాయకులు ,చిట్యాల.గంగన్నమాజీ సర్పంచ్ ,వసంత్ రావు జాదవ్ తదితరులు పాల్గొన్నారు

## ముద్దులొలికే 'తల్లిపాల వారోత్సవాలు': బుజ్జాయిల ఆరోగ్యమే లక్ష్యంగా సర్పంచ్....



**మల్లకల్ ఆగస్టు 6 :** జోగులాంబ గద్వాల జిల్లా మంద మల్లకల్ మండల పద్మా వెంకటేష్ నాయక్ పిలుపు!

నేతివానిపల్లి గ్రామం బుజ్జాయిల చిరునవ్వులు, అమ్మల మురిపాలతో కళకళలాడింది. సర్పంచ్ పద్మా వెంకటేష్ నాయక్ ఆధ్వర్యంలో గ్రామంలో 'తల్లిపాల వారోత్సవాలు' (వరప్రహం) ఎంతో ముద్దుగా, ఘనంగా జరిగాయి.

హైలైట్స్ ఇవే:

అమ్మల మురిపం: చిన్నారులకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తూ ఊరంతా సందడి చేశారు.

ఆరోగ్య దేవతలు: అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు గ్రామపంచాయతీ సెక్రటర్ ఇల్లెక్కి మరీ అమ్మలకు ప్రేమతో మంచి మాటలు చెప్పారు.

సర్పంచ్ పద్మ వెంకటేష్ నాయక్ సందేశం: “బిడ్డకు తల్లిపాలే అమృతం..మన ఊరి పిల్లలంతా ఆరోగ్యంగా నవ్వుతూ ఉండాలి” అని సర్పంచ్ పద్మా వెంకటేష్ నాయక్ ఆశీస్సులు అందించారు.

బుజ్జాయిల ఆరోగ్యం కోసం ఊరంతా ఒక్కటైన ఈ వేడుక అందరి మనసులను గెలుచుకుంది.

## చింతకాని గ్రామ పంచాయతీ లో మొక్కలు పంపిణీ చేసిన సర్పంచ్ కిలారు మనోహర్ బాబు



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**మండల కేంద్ర పంచాయతీ లో ఉదయం కిలారు మనోహర్ బాబు మొక్కలు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఇంటింటికి వెళ్లి గ్రామపంచాయతీ సిబ్బంది మొక్కలు పంపిణీ చేశారు.

ప్రతి ఒక్కరు కనీసం ఐదు మొక్కలు నాటలని ఈరోజు అడవులను నరికి వేయడం వాళ్ళ మన ఎల్ నినో నీ ఎదుర్కోవాల్సి వస్తుంది ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటి సంరక్షణ కూడా చూడాలని మనోహర్ బాబు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో చింతకాని సెక్రటరీ రమేష్ బాబు వార్డు మెంబర్లు కిలారు బాబురావు,వేముల ఆకాష్, ఫీల్డ్అసిస్టెంట్ తలారి వేణు, కోలా నాగేశ్వరరావు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పెళ్లి కావడం లేదన్న మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

**పెళ్లి కావడం లేదని మనస్థాపం చెందిన యువకుడు మద్యం మత్తులో ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు**



**సికె న్యూస్ కొల్చారం నర్సాపూర్ :** మెదక్ జిల్లాకొల్చారం మండలం రంగంపేట గ్రామం లో పెళ్లి కావడం లేదని మనస్థాపం చెందిన యువకుడు మద్యం మత్తులో ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం ఉదయం కొల్చారం మండలం రంగంపేట లో వెలుగు చూసింది. మృతుని అన్న లక్ష్మీనారాయణ, కొల్చారం ఎస్ఐ మహమ్మద్ మోహినుద్దీన్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. రంగంపేటకు చెందిన వేముల లింగం చిన్న కుమారుడు కుమార్(29) అలియాస్ పంతులు వంట మాస్టర్ గా ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో పని చేసేవాడు. మద్యంకు బానిస అయినా కుమార్ గత కొన్ని రోజులుగా పనిచేయకుండా మద్యం తాగుతూ జులాయిగా తిరిగేవాడు. దీంతో అతనికి పిల్లనివ్వడానికి ఎవరూ ముందుకు రాకపోవడంతో మనస్థాపం చెంది ఇంట్లో అందరూ నిద్రించిన తర్వాత సీలింగ్ కు నైలాన్ చీరతో ఉరి వేసుకుని మృతి చెందినట్లు తెలిపారు మృతిని సోదరుని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని మెదక్ జిల్లా ఆసుపత్రికి తరలించారు

## మత్కేపల్లి ఎక్స్ రోడ్డు వద్ద ఖమ్మం--విజయవాడ ఎక్స్‌ప్రెస్ బస్సు అధికారిక నిలుపుదల..




**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**చింతకాని మరియు ముదిగొండ మండలాల ప్రజల సౌకర్యార్థం, మండల ప్రజల విజ్ఞప్తి మేరకు ఖమ్మం--విజయవాడ ఎక్స్‌ప్రెస్ బస్సుకు మత్కేపల్లి ఎక్స్ రోడ్డు వద్ద అధికారికంగా స్టాప్ మంజూరు చేయడం జరిగింది.

ఇకపై ఖమ్మం నుండి ప్రతిరోజు ఉదయం 5:00 గంటలకు విజయవాడకు బయలుదేరే ఎక్స్‌ప్రెస్ బస్సును మత్కేపల్లి ఎక్స్ రోడ్డు వద్ద 5:30 గంటలకు చింతకాని, ముదిగొండ మండలాల ప్రజలు ఎక్కి తమ ప్రయాణాన్ని సౌకర్యవంతంగా కొనసాగించవచ్చు.

ఈ సౌకర్యం వల్ల రెండు మండలాల ప్రజలకు విజయవాడ ప్రయాణం మరింత సులభతరం కానుంది.

ఈ అవకాశాన్ని కల్పించిన ఖమ్మం డిపో మేనేజర్ కి చింతకాని, ముదిగొండ మండలాల ప్రజల తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము.

ప్రజలందరూ ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని మనవి.

## రూ.3.50 కోట్ల విలువైన 696.1 కిలోల గంజాయి దహనం.

**32 కేసుల్లో స్వాధీనం చేసుకున్న మత్తు పదార్థాల నిర్వీర్యం..**

**సి కె న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఆగస్టు 06,**ఖమ్మం ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి ఆదేశాల మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని నాలుగు ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న రూ.3.50 కోట్ల విలువైన 696.1 కిలోల గంజాయిని గురువారం దహనం చేశారు.

కొత్తగూడెం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో స్వాధీనం చేసుకున్న 316.07 కిలోలు, భద్రాచలం ఎక్సైజ్ స్టేషన్‌లోని 329.51 కిలోలు, పాల్వంచ ఎక్సైజ్ స్టేషన్‌లోని 43.62 కిలోలు, మణుగూరు ఎక్సైజ్ స్టేషన్‌లోని 6.90 కిలోల గంజాయిని ప్రభుత్వ అనుమతి పొందిన ఏడబ్ల్యూఎస్ గంజాయి దహన కేంద్రం, తల్లాడ మండలం గొపాల్‌పేటలో శాస్త్రీయ పద్ధతిలో నిర్వీర్యం చేశారు.



జిల్లాలోని నాలుగు ఎక్సైజ్ స్టేషన్లలో నమోదైన మొత్తం 352 కేసులకు సంబంధించిన గంజాయిని ఖమ్మం ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు దహనం చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఈఎస్ శ్రీనివాసరెడ్డి, సీఐలు మరియు ఇతర ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

## తుడుందెబ్బ ఆవిర్భావం నేటికి 30 ఏళ్లు ఆవిష్కరణ దినోత్సవ ఘనంగా




**సికే న్యూస్ ఆగష్టు 6 మహబూబాబాద్ జిల్లా (ప్రతినిధి: దుర్గం మురళి**

తుడుందెబ్బ ఆవిర్భవించి నేటికి 30 సంవత్సరాలు కావస్తున్న సందర్భంలో గ్రామ గ్రామాన తుడుందెబ్బ నాయకులు జెండాలు ఆవిష్కరణ చేశారు ముఖ్యంగా శెట్టిపల్లి లో జెండా ఆవిష్కరణ చేసి కోమరం భీం కు పూల మాల వేయడం జరిగింది. జిల్లా నాయకులు కల్తీ మల్లయ్య అధ్యక్షతన జెండా ఆవిష్కరణ గ్రామ పటేల్ మండల సహాయ కార్యదర్శి ఇర్ప రాజేంద్ర ప్రసాద్ ఎగుర వేశారు. మండల ఉపాధ్యక్షుడు ఇర్ప కృష్ణ మాట్లాడారు అనంతరం రేగులగుడెం, శంభునిగూడెం, వెన్నెల బైలు గ్రామాలలో జెండా ఆవిష్కరణలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ దొర పటేళ్లు మరియు ఆదివాసి యువకులు మహిళలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జయశంకర్ ఆశయాలు అందరికీ ఆదర్శం: జిల్లా ఎస్పీ సునిత రెడ్డి



**సీకే న్యూస్ ప్రతినిధి, వనపర్తి జిల్లా:**వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ 92వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సునిత రెడ్డి, ఐపీఎస్. జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

అనంతరం ఎస్పీ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనకు ప్రొఫెసర్ జయశంకర్ అందించిన సిద్ధాంతపరమైన మార్గదర్శకత్వం చిరస్మరణీయమని అన్నారు. ప్రజల ఆత్మగౌరవం, హక్కులు, సమాన అభివృద్ధి కోసం ఆయన జీవితాంతం చేసిన కృషి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. జయశంకర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని నిజాయితీ, సేవాభావంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, ప్రభుత్వ ఉద్యోగులు నిబద్ధతతో విధులు నిర్వహించడమే ఆయనకు నిజమైన నివాళి అని ఎస్పీ తెలిపారు. తెలంగాణ అభివృద్ధి, సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి, డీఎస్పీ గిరిబాబు, ఏఓ సునంద, సీఐ సుగంధ రత్నం, సీసీఎస్ సీఐ అశోక్ కుమార్, ఆర్ఐ శ్రీనివాస్, ఆర్ఎస్ఐ వినోద్‌తో పాటు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఐసీడీఎస్ భవనాన్ని సందర్శించిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

- తాత్కాలికంగా కార్యాలయం కొనసాగింపు కొరకు ఎంపిడివో కార్యాలయంపై భవన నిర్మాణం
- బోథ్ లో ఇంటిగ్రేటెడ్ కార్యాలయం మంజూరు చేయాలని మంత్రికి విన్నవించాం
- ప్రభుత్వ కార్యాలయాలు ఏ ఒక్కటి కూడా బోథ్ దాటకుండా చూస్తా



**.బోథ్. పీకే న్యూస్.** బోథ్ లో గల ఐసీడీఎస్ కార్యాలయం తరలిపోతుందని వచ్చిన వార్తకు తక్షణమే స్పందించిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మంత్రి సీతక్కను కలిసి భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. అదేవిధంగా ఈరోజు బోథ్ లో శిథిలావస్థలో గల ఐసీడీఎస్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. తాత్కాలికంగా ఐసీడీఎస్ మరియు పంచాయతీ రాజ్ డీఈ కార్యాలయాల కొనసాగింపు కొరకు రూ. 20 లక్షలతో ఎంపిడివో కార్యాలయంపైన నిర్మించే స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపిడివో కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు.

1. ఐసీడీఎస్ కార్యాలయం
2. ఇంటిగ్రేటెడ్ కార్యాలయం
3. పంచాయతీ రాజ్ డీఈ కార్యాలయాలపై అధికారులతో ప్రజా ప్రతినిధులతో చర్చించారు. అనంతరం ఎంపిడివో కార్యాలయాన్ని సందర్శించి ఉద్యోగస్తులతో మాట్లాడి పలు అంశాలపై ఆరా తీశారు.

ఈ కార్యక్రమంలో ఎంపిడివో, సీడీపీవో, సర్పంచుల సంఘం అధ్యక్షులు స్వామి, మాజీ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, సర్పంచులు సుధీర్ రెడ్డి, రాజు, రవీందర్, బాబులాల్, సంజీవ్, మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎలుక రాజు, విడిసి చైర్మన్ పోతన్న, మెడిచేల్మా ప్రవీణ్, రమణ రెడ్డి, బత్తుల రమేష్, గంగమల్లు, సంజీవ్, సందీప్, సుజీల్ తో పాటు ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాజీ విద్యా వాలంటీర్ కొమ్ము రమేష్‌బాబు మృతి

- ఆయన శిష్యులు పలురంగాల్లో ఉన్నత స్థాయిలో రాణింపు
- విద్యారంగానికి తీరని లోటని పలువురి నివాళి



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** చింతకాని : చింతకాని మండల పరిధిలోని తిమ్మినేనిపాలెం గ్రామానికి చెందిన మాజీ విద్యా వాలంటీర్ కొమ్ము రమేష్‌బాబు అనారోగ్యంతో గురువారం మృతిచెందారు. ఆయన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పలు సంవత్సరాల పాటు విద్యా వాలంటీర్‌గా సేవలందించి, ఎంతోమంది విద్యార్థులకు ఉత్తమ విద్యాబోధన చేశారు.

ఆయన వద్ద విద్యనభ్యసించిన అనేక మంది విద్యార్థులు ప్రస్తుతం వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు నిర్వహిస్తూ గురువుకు పేరు తీసుకొచ్చారు. రమేష్‌బాబు మార్గదర్శకత్వంలో విద్యార్థులు క్రమశిక్షణతో పాటు విలువలతో కూడిన విద్యను అభ్యసించారని, విద్యారంగానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు కొనియాడారు.

ఆయన శిష్యులు ఖమ్మం రూరల్ విద్యుత్ శాఖ ఏఈ (టెక్నికల్) రజియా, మహబూబాబాద్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి నర్సింగ్ ఆఫీసర్ రేబల్లి జ్యోతి, భద్రాద్రి కొత్తగూడెం పంచాయతీరాజ్ శాఖ ఏఈఈ మొండితోక నవీన్ ఆయన మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కొమ్ము ప్రభు, ఉపసర్పంచ్ బుచ్చిబాబు, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు షేక్ మధార్, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బద్రి కాశి, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి గోదా మంగయ్య, గ్రామ పెద్దలు నంజాల అప్పారావు, కంచుమర్తి నరేష్‌బాబు, పోటు నాగేశ్వరరావు, బద్రి నాగేశ్వరరావు, తెల్లబోయిన గోపి తదితరులు రమేష్‌బాబు భౌతికకాయానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## అమ్మ పాలు అమృతం -- ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అవగాహన కార్యక్రమం



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** చింతకాని : చింతకాని మండలంలోని సీతంపేట గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా గ్రామ సర్పంచ్ ఆళ్ళ మణి పానకాల రావు ఆధ్వర్యంలో తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఆళ్ళ మణి పానకాల రావు మాట్లాడుతూ, తల్లిపాలను నిర్లక్ష్యం చేయడం వల్ల శిశువుల్లో పోషకాహార లోపంతో పాటు తరచూ అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని తెలిపారు. ప్రతి తల్లి తన బిడ్డకు పుట్టినప్పటి నుంచే తల్లిపాలు అందించి ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు బాటలు వేయాలని పిలుపునిచ్చారు.

పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ, పరిశుభ్రమైన పరిసరాలు, తల్లి--శిశు సంరక్షణ, తల్లిపాలు ఈ మూడు ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి పునాదులని పేర్కొన్నారు. శిశువుల శారీరక, మానసిక ఎదుగుదలకు తల్లిపాలు అత్యంత అవసరమని వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గర్భిణీలు, బాలింతలు, గ్రామ పెద్దలు మరియు మహిళలు పాల్గొన్నారు.

# కొత్తూరు మున్సిపాలిటీలో ఘనంగా పోచమ్మ బోనాలు

### అమ్మవారికి బోనాలు సమర్పరించి మొక్కులు తీర్చుకున్న మహిళలు



**షాద్నగర్ నియోజకవర్గం సి.కే న్యూస్ ప్రతినిధి ఆగస్టు 6:** రంగారెడ్డి జిల్లా షాద్నగర్ నియోజకవర్గం పరిధిలో కొత్తూరు మున్సిపాలిటీలో గురువారం పోచమ్మ బోనాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో చిన్నారులు, మహిళలు,గ్రామ పెద్దలు పాల్గొని అమ్మవారికి మొక్కులు సమర్పరించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు జండగూడెం సుదర్శన్ గౌడ్, మాజీ కౌన్సిలర్ మాదారం నరసింహా గౌడ్, కమ్మరి జనార్దన్ చారి,మాజీ ఎంపీటీసీలు జంగ గళ్ళ కృష్ణయ్య,బ్యాగరి యాదయ్య, నాయకులు శ్రీనివాస్ రెడ్డి,బండి కృష్ణ,ప్రభాకర్ రెడ్డి,రాజు,రవి నాయక్,శివ చారి,శంకర్ రెడ్డి, వడ్ల బాలరాజ్,మేకల రాఘవేందర్ యాదవ్,అనిల్, కొండారెడ్డి సుమన్,రమేష్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## షాద్‌నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్‌కు జన్మదిన వేడుకలు

**శాలువాతో సత్కారం.. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన మున్సిపల్, మార్కెట్ కమిటీ ప్రజాప్రతినిధులు**



**షాద్నగర్ నియోజకవర్గం సీకే న్యూస్ ప్రతినిధి ఆగస్టు 6 :** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి, కేక్ కట్ చేయించి పలువురు ప్రజాప్రతినిధులు, మార్కెట్ కమిటీ సభ్యులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సులోచన కృష్ణారెడ్డి, షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, మార్కెట్ కమిటీ కార్యదర్శి వెంకట్ రెడ్డి పాల్గొని కరుణాకర్‌కు శుభాకాంక్షలు తెలియజేసి ఆయురారోగ్యాలు, మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సభ్యులు భరత్ లహోటి, నవీన్, సందీప్, రవి నాయక్, రెడ్డిపాలెం బాలశివరెడ్డి సి.నర్సింలు, వెంకట్ రెడ్డి, సురేష్ గౌడ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## శేరిలింగంపల్లి అసెంబ్లీ, హఫీజ్ పేట్ డివిజన్ లో,

### ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనే ఊపిరిగా జీవితాన్ని అంకితం చేసిన గొప్ప నాయకుడు ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి సందర్భంగా ఘన నివాళులు,



హఫీజ్ పేట్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు కైతాపురం జితేందర్ ఆధ్వర్యంలో హుడా కేఫ్ వద్ద, తెలంగాణ సిద్ధాంత కర్త, తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక ఆచార్య శ్రీ కొత్తపల్లి జయశంకర్ గారి జయంతి సందర్భంగా ఆ మహనీయుడి విగ్రహానికి పూలమాలతో ఘననివాళులు అర్పించడం జరిగింది, ముఖ్య అతిథిగా, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ అజిత్ కుమార్ సేనాపతి గారు, బీజేపీ సీనియర్ నాయకులు, గూజ మెంబర్ పోరెడ్డి బుచ్చిరెడ్డి గారు పాల్గొన్నారు, వారు మాట్లాడుతూ....

ఆరు దశాబ్దాల తెలంగాణ పోరాటానికి ఊపునిచ్చిన ఉద్యమ శిఖరం,
పుట్టుక మీది, చావు మీది.. బ్రతుకంతా తెలంగాణది అని తెలంగాణ పౌరుషాన్ని తట్టి లేపిన తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి ప్రదాత,
తెలంగాణ సిద్ధాంత కర్త, ఆచార్య శ్రీ కొత్తపల్లి జయశంకర్ గారి ఆశయాలను తెలంగాణ ప్రతీ పౌరుడు కొనసాగించాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రమణయ్య, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు రవి గౌడ్ ,
జిల్లా బీజేపీ కౌన్సిలర్ మెంబర్ ఆళ్ల వరప్రసాద్, బీజేపీ నాయకులు సత్యనారాయణ రాజు , శేఖర్ ముదిరాజ్ , అశోక్ ముదిరాజ్ , రామ్ రెడ్డి , శ్రీకాంత్ , లోకేష్ , నరేష్ , విజయ్ మరియు ఇతరులు పాల్గొన్నారు.

## మాటూరు అంగన్‌వాడీ-2లో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు



**సీకే న్యూస్ ప్రతినిధి మధిర** మధిర మండలం మాటూరు అంగన్‌వాడీ-2 కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అంగన్వాడి టీచర్ కంచ పోగు సునీత మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.

పుట్టిన గంటలోపే శిశువుకు తల్లిపాలు పట్టించడం, తొలి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే ఇవ్వడం ద్వారా శిశువుకు సంపూర్ణ పోషకాహారం అందడంతో పాటు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. తల్లి ఆరోగ్యంతో పాటు శిశువు ఎదుగుదలలో తల్లిపాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకుంటూ ప్రభుత్వ ఆరోగ్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.లి కార్యక్రమంలో ఎంపీపీ ఎస్ మాటూరు ప్రధానోపాధ్యాయులు జీవరత్నం అంగన్‌వాడీ టీచర్ కంచి పోగు సునీత ,, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు..

# తెలంగాణ గీతం.. ఉద్యమానికి ప్రాణం..

- గద్దర్ అన్న సేవలు అజరామరం..
- ప్రజా యుద్ధనౌక గద్దర్ వర్ధంతి వేడుకల్లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..
- ఉద్యమ వీరుడికి ఘన నివాళి..



**షాద్నగర్ నియోజకవర్గం సి.కే న్యూస్ ప్రతినిధి ఆగస్టు 6**
తెలంగాణ ఆటగా.. పాటగా.. ఉద్యమ గీతంగా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహనీయుడు గద్దర్ అని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రశంసించారు. గద్దర్ వర్ధంతి వేడుకలను పురస్కరించుకొని పట్టణంలోని మండల పరిషత్ వద్ద ఆయనకు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా తన పాటతో ప్రజల్లో చైతన్యాన్ని నింపుతూ తెలంగాణ ఉద్యమంలో కూడా పాటల ద్వారా ప్రజా చైతన్యం తెచ్చి నిరంతరం జనం కోసమే పని చేసిన నిస్వార్థ నాయకుడు గద్దర్ అని కొనియాడారు. నక్సలైట్ గా ముద్ర వేసినా, బుల్లెట్లను శరీరంలోకి దించిన అదరక, బెదరక ఎన్నో ప్రజా ఉద్యమాలకు ఊపిరి పోసారని అన్నారు. ఆయన సేవలను గుర్తించినందుకే సినీ కళాకారులకు ఇచ్చే పురస్కారాలకు గద్దర్ అవార్డులోని సీఎం రేవంత్ రెడ్డి నామకరణం చేశారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ను అధికారంలోకి వస్తే చూడాలని ఆయన ఎంతో ఆశించారని, కానీ కాంగ్రెస్ అధికారంలోకి రాకముందే ఆయన వెళ్లిపోవడం బాధాకరమని అన్నారు. నిస్వార్థ నాయకుడిగా నిరంతరం ప్రజల కోసమే పని చేసిన ఆయన పేరు ఎప్పటికీ చిరస్థాయిగా గుర్తుండిపోతుందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. కాంగ్రెస్ నాయకులు, జేఏసి నేతలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి జన్మదిన సందర్భంగా యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారికి ప్రత్యేక పూజలు

- రానున్న గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి విజయం సాధించాలని ప్రత్యేకంగా ప్రార్థించిన అందె బాబయ్య



**షాద్నగర్ నియోజకవర్గం సి.కే న్యూస్ ప్రతినిధి ఆగస్టు 6**
బీజేపీ రాష్ట్ర నాయకుడు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి జన్మదిన సందర్భంగా యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారిని కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారి సన్నిధిలో ప్రత్యేక అర్చనలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వేద పండితుల ఆశీర్వాదాలు స్వీకరించిన నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి, ప్రజాసేవకు మరింత శక్తి, ధైర్యం, సంకల్పం ప్రసాదించాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. అలాగే షాద్‌నగర్ నియోజకవర్గ ప్రజలపై స్వామివారి కృప ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నారు.
ఈ సందర్భంగా బీజేపీ షాద్‌నగర్ ఇన్‌చార్జ్ అందె బాబయ్య మాట్లాడుతూ, నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి అనేక సంవత్సరాలుగా సిద్ధాంతపరంగా పార్టీకి అంకితభావంతో పనిచేస్తూ, షాద్‌నగర్‌తో పాటు రాష్ట్రంలో బీజేపీ విస్తరణకు విశేష కృషి చేశారని అన్నారు. తనకు షాద్‌నగర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం వచ్చినప్పుడు పార్టీ నిర్ణయానికి కట్టుబడి, తన విజయం కోసం అహర్నిశలు శ్రమించిన నాయకుడని కొనియాడారు. రానున్న బీజేపీ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి పార్టీ అభ్యర్థిగా విజయం సాధించాలని, ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం కలగాలని శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారిని ప్రత్యేకంగా ప్రార్థించినట్లు అందె బాబయ్య తెలిపారు. అలాగే ఆయన ఆయురారోగ్యాలతో, ఆనందసంతోషాలతో మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారూ. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు అశోక్ గౌడ్, శ్రీనివాస్ చారి, హరీష్, రవి నాయక్, చెన్నయ్య, ప్రవీణ్, భాను తదితరులు పాల్గొన్నారు

## బిడ్డకు....తల్లిపాలను మించిన దివ్య ఔషధం.. మరొకటి లేదు

**అంగన్వాడీ టీచర్ పోకల వెంకమ్మ**



**గరిడేపల్లి సికె న్యూస్ ప్రతినిధి సందీప్ నాయక్ గుగులోతు**
గరిడేపల్లి మండల పరిధిలో ఉన్న గానుగబండ గ్రామంలో తల్లిపాలు బిడ్డకు ఎంతో మేలని పుట్టిన గంటలోపు ముర్రు ప్రాలు త్రాగించడం వలన బిడ్డలో రోగ నిరోధక శక్తి పెరిగి ఆరోగ్యంగా ఉంటారని అంగన్వాడీ టీచర్ పోకల వెంకమ్మ అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గరిడేపల్లి మండలంలోని గానుగబండ గ్రామంలో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డకు ఆరు నెలలు వయస్సు పూర్తయ్యేంతవరకు కూడా కేవలం తల్లిపాలను మాత్రమే త్రాగించాలని దాని వలన బిడ్డకు మరియు తల్లికి ఆరోగ్యపరంగా కలిగే లాభాలను ఆమె గర్భిణీ బాలింతలకు వివరించారు. బిడ్డ కడుపులో ఉండగా తల్లి ఆకుకూరలు కూరగాయలు ఎక్కువగా తింటే, తల్లి ఆరోగ్యంగా ఉండటంతో పాటు కడుపులోని బిడ్డ కూడా ఆరోగ్యంగా ఉంటారని ఆమె అన్నారు.ప్రతి తల్లి కూడా తన బిడ్డకు ఆరు నెలల వయసు వచ్చేంతవరకు కేవలం తల్లి పాలను మాత్రమే త్రాగించాలని, ఆ విధంగా బిడ్డకు తల్లిపాలను త్రాగిస్తే, బిడ్డ ఆరోగ్యంగా ఉండటం తో పాటు,తల్లీ బిడ్డల మధ్య కూడా ఆప్యాయత అనురాగాలు, మమతానుబంధాలు పెరుగుతాయని ఆమె అన్నారు.
ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ పోకల వెంకమ్మ, అమరారపు సత్యవతి, తాళ్ళ అనిత,ఆయాలు గోవిందమ్మ,నాగమణి, మరియు గర్భిణీ స్త్రీలు, బాలింతలు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ఆరోగ్యాలతో, పెద్ద శివనూర్ సివిక పౌల్ట్రీ ఫామ్ చెలగాటం

పౌల్ట్రీ ఫార్మ్ ఎదుట గ్రామస్తుల ధర్నా






ఆగస్ట్ 06 (సీ కే న్యూస్) చేగుంట :పెద్ద శివనూర్, గ్రామంలో సివికా పౌల్ట్రీ ఫామ్ వల్ల ప్రజలకు అనారోగ్యాలు వివరాల ప్రకారం, చేగుంట మండల్ పెద్దశివనుర్ గ్రామంలోనీ పౌల్ట్రీ ఫామ్ వల్ల దుర్వాసన విచ్చలవిడిగా ఈగలు,పెరిగిపోయాయని పెద్ద శివునూర్ గ్రామస్తులు రెండో రోజు సర్పంచ్ నర్సింలు ఆధ్వర్యంలో పౌల్ట్రీ ఫార్మ్ వద్ద ధర్నా నిర్వహించారు, విషయం తెలుసుకున్న చేగుంట ఎస్ఐ చైతన్య కుమార్ రెడ్డి హుటా హుటిన అక్కడికి చేరుకొని ఆందోళన కారులతో మాట్లాడి , అతిత్వరలోనే పౌల్ట్రీ ఫామ్ యజమాన్యం తో మాట్లాడి త్వరలోనే సమస్యను పరిష్కరిస్తారని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు, అనంతరం గ్రామ సర్పంచ్ నర్సింలు మాట్లాడుతూ గ్రామ శివారులోని సీవీకే పౌల్ట్రీ ఫామ్ వల్ల గ్రామంలోకి దుర్వాసన రావడంతో పాటు గ్రామం మొత్తం ఈగలు వ్యాపిస్తున్నాయని, గత వర్షాకాలంలో సైతం గ్రామంలో విపరీతంగా ఈగలు పెరిగిపోయాయని పలువురు అనారోగ్యం బారిన పడ్డారని ఆరోపించారు. వెంటనే పరిశ్రమ నిర్వాహకులు దుర్వాసన రాకుండా చర్యలు తీసుకోవాలని లేదంటే పౌల్ట్రీ ఫార్మ్ ను మూసివేయాలని పేర్కొన్నారు. మూడు గంటల పాటు నిరసన వ్యక్తం చేయగా పౌల్ట్రీ ఫామ్ కు సంబంధించిన నిర్వాహకులు ఎవరూ లేకపోవడంతో రెండు రోజుల తర్వాత నిర్వాహకులు గ్రామస్తులతో మాట్లాడుతామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. అనంతరం పంచాయతీ సెక్రెటరీ రాజు పౌల్ట్రీ ఫార్మ్ యజమానియానికి సంజాయిషీ కోరుతూ నోటీసు అందజేశారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ నర్సింలు, ఉప సర్పంచ్ మల్లేశం, శ్రీరాములు, బండ రాములు, రమేష్,నాయకులు సురేందర్, అప్పాల శేఖర్, బిజెపి మండల అధ్యక్షుడు నాగేందర్ రెడ్డి, సురేందర్ రెడ్డి, ప్రశాంత్, తలారి అశోక్, యాదగిరి, నాగరాజు, శ్రీనివాస్,రాజు, నర్సింలు, మల్లేష్, గ్రామ పెద్దలు గ్రామస్తులు పాల్గొన్నారు.

# గూడూర్ బీఆర్ఎస్ కార్యకర్త మీసాల రమేష్‌కు మాతృవియోగం

పార్థీవ దేహానికి నివాళులర్పించిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్



షాద్నగర్ నియోజకవర్గం సి కె న్యూస్ ప్రతినిధి ఆగస్టు 31:కొత్తూర్ మండలం గూడూరు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త మీసాల రమేష్ తల్లి శ్రీమతి పార్వతమ్మ ప్రమాదవశాత్తు మృతి చెందారు. ఈ విషాద వార్త తెలుసుకున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్ వారి స్వగ్రామానికి వెళ్లి పార్వతమ్మ పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మీసాల రమేష్ కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. పార్వతమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని వేడుకున్నారు. పరామర్శించిన వారిలో స్థానిక మాజీ సర్పంచ్ సత్తయ్య, మాజీ మండల అధ్యక్షులు పెంటనోళ్ళ యాదగిరి, మాజీ కౌన్సిలర్ కోస్గి శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీలు రాజేందర్ గౌడ్, లక్ష్మణ్ నాయక్, నాయకులు పాండు, వాజీద్, కడాల శ్రీశైలం, గోపాల్ నాయక్, సదానందం తదితరులు ఉన్నారు..


## ఆర్ఎంపీ డాక్టర్ కట్ట వెంకటేశ్వర్లుకు కూరపాటి కిషోర్ నివాళి



సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన ప్రముఖ ఆర్ఎంపీ వైద్యుడు, ఎంఆర్పీఎస్ రాష్ట్ర నాయకులు కట్ట వెంకటేశ్వర్లు మృతిపై మండల కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కూరపాటి కిషోర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వారి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా కూరపాటి కిషోర్ మాట్లాడుతూ, కట్ట వెంకటేశ్వర్లు సేవాభావంతో ప్రజలకు వైద్య సేవలు అందించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. వారి మరణం కుటుంబ సభ్యులకు మాత్రమే కాకుండా గ్రామానికి తీరని లోటని పేర్కొన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఈ విషాదాన్ని తట్టుకుని మనోధైర్యంతో ఉండాలని ఆకాంక్షించారు.

# నూతన డీసీసీ కార్యాలయం స్థలాన్ని పరిశీలించిన డీసీసీ అధ్యక్షులు డా. నరేష్ జాదవ్ గారు



(సీ కే న్యూస్) ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నిర్మాణం కోసం కేటాయించిన ఎకరం స్థలాన్ని ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు డా. నరేష్ జాదవ్ గారు, మాజీ డీసీసీ అధ్యక్షులు శ్రీ సాజిద్ ఖాన్ గారు, మాజీ మార్కెట్ చైర్మన్ శ్రీ అల్లూరి సంజీవరెడ్డి గారు పరిశీలించారు.

ఈ సందర్భంగా నూతన పార్టీ కార్యాలయ నిర్మాణానికి అవసరమైన ఏర్పాట్లు, స్థలాన్ని చదును చేయడం, పనులను వేగవంతంగా చేపట్టే అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ ఆగస్టు నెలలోనే నూతన జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలోకి ప్రవేశించేలా పనులను పూర్తి చేయాలని డీసీసీ అధ్యక్షులు డా. నరేష్ జాదవ్ గారు అధికారులకు, పార్టీ నాయకులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి బాలూరి గోవర్ధన్ రెడ్డి గారు,మున్సిపల్ చైర్మన్ శ్రీ బండారి అనూష సతీష్ గారు, డీసీసీ ఆఫీస్ ఇన్‌చార్జ్ శ్రీ గౌలి సంజీవ్ కుమార్ గారు, మాజీ టీటీడీ బోర్డు సభ్యులు ఝుఖె మెంబెర్ శ్రీ బెజ్జంకి అనిల్ కుమార్ గారు, జిల్లా కాంగ్రెస్ ట్రెజరర్ శ్రీ హిమాభిషేక్ రెడ్డి గారు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ ఖిజార్ పాషా గారు, సేవాదళ్ మోతీ రామ్ జిల్లా కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ శ్రీ మల్యాల కరుణాకర్ గారు, శ్రీ ఖాడే సంతోష్ గారు, శ్రీ శ్రవణ్ నాయక్ గారు, శ్రీ జాదవ్ రాధేశ్యామ్ గారు, అలాగే కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




ఇచ్చోడ.సికె. న్యూస్

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇచ్చోడలో స్పెషల్ ఫేస్ –2 ప్రవేశాల కోసం ఈనెల ఆరవ తేదీ నుంచి 11వ తేదీ వరకు దరఖాస్తులు దోస్త్ వెబ్సైట్ ద్వారా చేసుకోవచ్చని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఏ శ్రీనివాస్ , అడ్మిషన్ కోఆర్డినేటర్ డాక్టర్ వి సరిత రాణి తెలియజేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశం పొందడానికి ఇది చివరి అవకాశం అని కాబట్టి ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థిని విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాల్సిందిగా కోరారు. ఈ స్పెషల్ ఫేసులో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఈనెల 12 వరకు తమ వెబ్ ఆప్షన్స్ ఎంపిక చేసుకోవచ్చని తెలిపారు. ఈ పేజ్ దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈనెల 14వ తేదీ ఈరోజు సీట్లు కేటాయిస్తారని, సీట్లు పొందిన విద్యార్థులు ఈనెల 14 నుండి 18 వ తేదీ వరకు ఆన్లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ పూర్తి చేసుకోవచ్చని తెలియజేశారు.

# పీఎంపీ నిర్లక్ష్యమా..? ఐదేళ్ల చిన్నారి మృతి.



- ఇంజక్షన్ అనంతరం అస్వస్థత.. 'ఏమీ కాదని' ఇంటికి పంపినట్లు ఆరోపణలు...
- ఘటనపై పోలీసులు దర్యాప్తు.. పీఎంపీపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తుల డిమాండ్...

సి కె న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ సుజాతనగర్ ప్రతినిధి ఆగస్టు 06,భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ మండలం మాల బంజర గ్రామంలో జ్వరంతో చికిత్స కోసం తీసుకెళ్లిన ఐదేళ్ల చిన్నారి మృతి చెందిన ఘటన విషాదాన్ని నింపింది. పీఎంపీ వైద్యుడి నిర్లక్ష్యమే చిన్నారి మృతికి కారణమని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గ్రామానికి చెందిన పనిత వెంకటకృష్ణ––వేణి దంపతుల కుమార్తె స్థానిక పాఠశాలలో ఎల్‌కేజీ చదువుతోంది. జ్వరం రావడంతో ఆమెను మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌కు తీసుకెళ్లారు. అక్కడ పీఎంపీ వైద్యుడు వరుసగా మూడు ఇంజక్షన్లు ఇచ్చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇంజక్షన్లు ఇచ్చిన కొద్ది సేపటికే చిన్నారి స్పృహ తప్పి కిందపడిపోయిందని, ఆందోళన వ్యక్తం చేసినప్పటికీ "ఏమీ కాదు.. ఇంజక్షన్ ప్రభావమే" అంటూ ఇంటికి తీసుకెళ్లాలని సూచించినట్లు ఆరోపించారు.

వైద్యుడి మాటలు నమ్మి చిన్నారిని ఇంటికి తీసుకెళ్లగా, కొద్దిసేపటికే ఇంట్లోనే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అధిక మోతాదులో మందులు, ఇంజక్షన్లు ఇవ్వడం వల్లే తమ కుమార్తె ప్రాణాలు కోల్పోయిందని వారు కన్నీరుమున్నీరుగా విలపించారు.

సమాచారం అందుకున్న సుజాతనగర్ ఎస్సై రమాదేవి ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరించి దర్యాప్తు ప్రారంభించారు. పోస్టుమార్టం నివేదికతో పాటు విచారణలో తేలే అంశాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

ఈ ఘటనపై మాల బంజర గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హతకు మించి వైద్యం చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న పీఎంపీ, ఆర్ఎంపీలపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని, చిన్నారి మృతికి బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

# చంద్రుగొండలో మళ్లీ అక్రమ వెంచర్ల జోరు...

- గిరిజన చట్టాలను ఉల్లంఘిస్తూ హైవే పక్కనే ప్లాట్ల విక్రయాలు...
- కొంటే అమ్ముకునే వీలు లేదు.. ఇల్లు కట్టుకునే అనుమతులూ లేవు...
- అధికారుల పర్యవేక్షణపై ప్రజల్లో అనుమానాలు...

సి కె న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ చంద్రుగొండ ప్రతినిధి,ఆగస్టు 06,చంద్రుగొండ మండల కేంద్రంలోని జాతీయ రహదారి వెంట మరోసారి అక్రమ వెంచర్ల వ్యవహారం ఊపందుకుంది. చంద్రుగొండ నుంచి కొత్తగూడెం వెళ్లే జాతీయ రహదారిపై పెట్రోల్ బంక్ సమీపంలో 1/70 గిరిజన చట్టాలను ఉల్లంఘిస్తూ వెంచర్లు ఏర్పాటు చేసి ప్లాట్ల విక్రయాలు కొనసాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఈ ఏడాది ఏప్రిల్‌లో ఇదే అంశంపై పత్రికల్లో కథనాలు వెలువడటంతో అధికారులు స్పందించి వెంచర్ హద్దులను తొలగించారు. అయితే నాలుగు నెలలు గడవకముందే అదే ప్రాంతంలో మళ్లీ వెంచర్ల అభివృద్ధి పనులు ప్రారంభమవడం పలు అనుమానాలకు తావిస్తోంది. అధికారులకు తెలిసే ఈ వ్యవహారం కొనసాగుతోందా అనే సందేహాలను ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.



గిరిజన ప్రాంతాల్లో అమలులో ఉన్న 1/70 చట్టం ప్రకారం వెంచర్లకు అనుమతులు లేవని తెలిసినా, వందలాది ట్రిప్పుల మట్టిని తరలించి అంతర్గత రహదారులు ఏర్పాటు చేసి భూమిని ప్లాట్లుగా విభజించి విక్రయిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. జాతీయ రహదారి పక్కనే ఈ కార్యకలాపాలు జరుగుతున్నప్పటికీ సంబంధిత శాఖల అధికారులు స్పందించకపోవడం విమర్శలకు దారితీస్తోంది. స్థానికుల ప్రకారం, ఈ ప్లాట్లను కొనుగోలు చేసిన వారికి భవిష్యత్తులో తీవ్ర ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. ప్లాట్ కొనుగోలు చేసిన తర్వాత గృహ నిర్మాణానికి అవసరమైన అధికారిక అనుమతులు లభించవని, అలాగే తిరిగి విక్రయించడంలోనూ చట్టపరమైన సమస్యలు ఎదురయ్యే అవకాశముందని చెబుతున్నారు. అయినప్పటికీ అన్ని అనుమతులు ఉన్నాయంటూ కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు అమాయకులను తప్పుదోవ పట్టిస్తూ ప్లాట్లు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అక్రమ వెంచర్లపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. అక్రమ వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేస్తే ఎదురయ్యే చట్టపరమైన, ఆర్థిక సమస్యలపై అధికారిక ప్రకటన విడుదల చేసి ప్రజలను అప్రమత్తం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# దీజీపీ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా జూ× పాదయాత్ర



ఇచ్చోడ సీకే న్యూస్...ఇచ్చోడ మండలం, ఆదిలాబాద్ జిల్లా

జూ× జాతీయ పిలుపు మేరకు ఆగస్టు 6 నుంచి 14 వరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రజా చైతన్య పాదయాత్రల్లో భాగంగా గురువారం ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలో జూ× మండల కార్యదర్శి కామ్రేడ్ కళ్లేపల్లి గంగయ్య ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో జూ× రాష్ట్ర సమితి సభ్యులు కామ్రేడ్ ఎస్. విలాస్, జూ× ఆదిలాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి సిర్ర దేవేందర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. శుభాష్ నగర్, ఇస్లాంపూర్, దేశముఖ్ నగర్, రంజాన్‌పూర్ తదితర వార్డుల్లో పాదయాత్ర నిర్వహిస్తూ కేంద్రంలోని దీజీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. అలాగే స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి పోరాడుతామని హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా కామ్రేడ్ ఎస్. విలాస్ మాట్లాడుతూ, 2014 ఎన్నికల సమయంలో దీజీపీ ఇచ్చిన హామీలైన ప్రతి ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు, విదేశాల్లోని నల్లధనాన్ని తీసుకొచ్చి ప్రతి కుటుంబానికి రూ.15 లక్షలు అందజేస్తామని చెప్పడం, అందరికీ ఇళ్లు కల్పిస్తామని ప్రకటించడం వంటి హామీలు అమలు కాలేదని విమర్శించారు. రైతులు, కార్మికులు, మహిళలు, యువత, విద్యార్థుల సమస్యలను విస్మరిస్తూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా పాలన సాగిస్తోందని ఆరోపించారు.

ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేకపోతే సెప్టెంబర్ 1న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జూ× ఆధ్వర్యంలో భారీ ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అదేవిధంగా రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేకపోతే ప్రజల తరఫున ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జూ× నాయకులు, కార్యకర్తలు మారుతి, సంతోష్, లక్ష్మీరాజు, దినేష్, లవ్‌కుశ్, రాధా, ఇస్మాయిల్, అబ్దుల్, రేష్మా, అమీనా, దేవమ్మ తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్ చొరవతో చెట్టు కొమ్మల తొలగింపు

వాహనదారులకు సులభమైన రాకపోకల



సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.మండల పరిధిలోని నరసింహాపురం గ్రామంలో వీధి లైట్ సమీపంలోని భారీ చెట్టు కొమ్మలు రోడ్డుపైకి విస్తరించి వాహనాల రాకపోకలకు ఆటంకంగా మారాయి. ఈ విషయాన్ని గ్రామ ప్రజలు సర్పంచ్ లోయ ఉపేందర్ దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే స్పందించిన సర్పంచ్ సంబంధిత సిబ్బందితో చెట్టు కొమ్మలను తొలగించే పనులు చేపట్టించారు.

చెట్టు కొమ్మల తొలగింపుతో రహదారిపై వాహనాల రాకపోకలు సాఫీగా సాగుతున్నాయని గ్రామస్తులు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారంలో సర్పంచ్ వెంటనే స్పందించి చర్యలు తీసుకోవడం అభినందనీయమని గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు..

ఈ కార్యక్రమంలో... ఎల్ శ్రీను, ఏపూరి వెంకన్న, పట్టేటి గోపయ్య,పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రి, సీతారాంపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అంకిత్

**రోగులకు నాణ్యమైన వైద్య సేవలు, విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలు అందించాలి -- జిల్లా కలెక్టర్ అంకిత్.**



**సి కె న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి,ఆగస్టు 06,**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, పరిశుభ్రత, ఔషధాల లభ్యత, సిబ్బంది పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించి పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా ఆసుపత్రిలోని ఇన్‌పేషెంట్, ఔట్‌పేషెంట్ వార్డులు, రక్త పరీక్షల విభాగం, ఔషధ నిల్వ గది, ఫార్మసీ తదితర విభాగాలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. వార్డుల్లో పరిశుభ్రత, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించి ఆసుపత్రి పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు.

ఔషధ నిల్వ గదిలో ఉన్న మందుల గడువు తేదీలను (ఎక్స్‌పైరీ డేట్లు) స్వయంగా తనిఖీ చేసిన కలెక్టర్, గడువు ముగిసిన లేదా గడువు సమీపిస్తున్న మందులను వెంటనే వేరు చేసి నిబంధనల ప్రకారం తొలగించాలని సూచించారు. రోగులకు అవసరమైన అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అనంతరం ఔట్‌పేషెంట్ విభాగానికి చికిత్స కోసం వచ్చిన రోగులతో జిల్లా కలెక్టర్ నేరుగా మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు, వైద్యుల స్పందన, మందుల లభ్యత, పరీక్షల నిర్వహణ తదితర అంశాలపై ఆరా తీశారు. ఏవైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకుని అవసరమైన సూచనలు చేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన వైద్య సేవలు సకాలంలో అందేలా వైద్యులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. పరిశుభ్రత, మందుల నాణ్యత, రోగుల పట్ల మర్యాదపూర్వక వ్యవహారం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండరాదన్నారు. ఆసుపత్రిలో అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

అనంతరం జిల్లా కలెక్టర్ పాల్వంచ మండలం సీతారాంపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణ, తరగతి గదులు, పరిశుభ్రత, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్వహణను పరిశీలించారు. విద్యార్థుల హాజరు వివరాలను పరిశీలించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా విద్యార్థులతో ఆత్మీయంగా మాట్లాడిన కలెక్టర్, వారికి అందుతున్న విద్యా బోధన, పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, ఇతర మౌలిక సదుపాయాలపై వివరాలు తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందుతున్నదా, భోజనం నాణ్యత ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా ఉపాధ్యాయులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేందుకు తల్లిదండ్రులతో సమన్వయం చేసుకుంటూ నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం పోషకాహారం, పరిశుభ్రమైన వాతావరణం, అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేలా సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

ఈ తనిఖీల్లో కొత్తగూడెం ఆర్డీవో మధు, తాసిల్దార్ దార ప్రసాద్ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యులు, సంబంధిత శాఖల అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# భద్రాచలం--వాజేడు రహదారికి మోక్షం కల్పించండి..



- **వారం రోజుల్లో పనులు ప్రారంభం కాకపోతే కాంట్రాక్టర్‌ను మార్చాలి: ఏపీ ఆర్అండ్‌బీ మంత్రికి తుమ్మల విజ్ఞప్తి..**
- **100 కి.మీ. ప్రయాణానికి మూడు గంటలు.. ప్రజల ఇబ్బందులపై వెంటనే స్పందించిన మంత్రి...**

**సి కె న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి ఆగస్టు 06,**భద్రాచలం--వాజేడు ప్రధాన రహదారిని వెంటనే అభివృద్ధి చేసి ప్రజల కష్టాలకు ముగింపు పలకాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆంధ్రప్రదేశ్ రోడ్లు--భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని కోరారు. బుధవారం ఈ మార్గంలో ప్రయాణించిన సందర్భంగా రహదారి అధ్వాన్న పరిస్థితిని స్థానికులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

గతంలో ఈ రహదారి నిర్మాణం జరిగినప్పటి నుంచి ఇప్పటివరకు సరైన మరమ్మతులు చేపట్టలేదని, కేవలం 100 కిలోమీటర్ల ప్రయాణానికే మూడు గంటలకు పైగా సమయం పడుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. రహదారి దుస్థితితో ఏళ్లుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు.

ప్రజల సమస్యలను విన్న వెంటనే స్పందించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఏపీ ఆర్అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, సంబంధిత అధికారులు, తెలంగాణ ఆర్అండ్‌బీ ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని వివరించారు. రహదారి మరమ్మతులు, అభివృద్ధి పనులను అత్యవసరంగా ప్రారంభించి ప్రజల ఇబ్బందులను తొలగించాలని కోరారు. వారం రోజుల్లో పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామని స్థానికులకు హామీ ఇవ్వడంతో వారు హర్షం వ్యక్తం చేశారు.

మంత్రి తుమ్మల మాట్లాడుతూ, రహదారి అభివృద్ధికి ఇప్పటికే పరిపాలనా అనుమతులు లభించినప్పటికీ కాంట్రాక్టర్ పనులు ప్రారంభించకపోవడం ఆందోళనకరమని మంత్రి జనార్దన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వారం రోజుల్లో పనులు ప్రారంభం కాకపోతే ప్రస్తుత కాంట్రాక్టర్‌ను తొలగించి కొత్త టెండర్లు పిలిచి పనులను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై మంత్రి జనార్దన్‌రెడ్డి సానుకూలంగా స్పందించి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

భద్రాచలం--వాజేడు రహదారి అభివృద్ధి పనులను మూడు ప్యాకేజీలుగా చేపట్టనున్నారు. భద్రాచలం నుంచి ఏటపాక వరకు ఆంధ్రప్రదేశ్ పరిధిలోని 7.8 కిలోమీటర్ల రహదారిని రూ.3.70 కోట్లతో, ఏటపాక నుంచి చర్ల మండలం సుబ్బంపేట వరకు భద్రాద్రి డివిజన్ పరిధిలోని 56.8 కిలోమీటర్ల రహదారిని రూ.67.58 కోట్లతో, సుబ్బంపేట నుంచి వాజేడు వరకు ములుగు డివిజన్ పరిధిలోని 48 కిలోమీటర్ల రహదారిని రూ.44 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు. మొత్తం 112.6 కిలోమీటర్ల పొడవున రూ.115.28 కోట్ల వ్యయంతో పనులు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

ఈ పనులను ఆంధ్రప్రదేశ్ చీఫ్ ఇంజినీర్ శ్రీనివాసరెడ్డి, తెలంగాణ చీఫ్ ఇంజినీర్ బీవీ రావు పర్యవేక్షించనుండగా, భద్రాచలం, ములుగు ఈఈలు క్షేత్రస్థాయిలో అమలు పర్యవేక్షించనున్నారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయానికి వచ్చే లక్షలాది మంది భక్తులు ఈ రహదారిపై ప్రయాణించే నేపథ్యంలో పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని మంత్రి తుమ్మల అధికారులను ఆదేశించారు.

# ఖమ్మం కార్పొరేషన్‌పై గులాబీ ముట్టడి

**ప్రజాధనం దోపిడీ.. కార్పొరేషన్‌పై బీఆర్ఎస్ ఫైర్**

**అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణకు డిమాండ్**



**సీకే న్యూస్ ఖమ్మం ప్రతినిధి ఇస్లావత్ నరసింహా ఆగస్టు 06 2026:** ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో జరుగుతున్న అవినీతి, అక్రమాలు, ప్రజా సమస్యలు, పరిపాలనా వైఫల్యాలపై భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ ఆధ్వర్యంలో గురువారం కార్పొరేషన్ కార్యాలయాన్ని ముట్టడించి డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం సమర్పించారు. నగరంలోని పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, రోడ్లు, వీధి దీపాలు, పార్కుల నిర్వహణ, అక్రమ నిర్మాణాలు తదితర సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా బీఆర్ఎస్ మాజీ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, ఆర్జేసీ కృష్ణ, కర్ణాటి కృష్ణ, బచ్చు విజయ్‌కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో ఖమ్మం కార్పొరేషన్ అవినీతికి కేంద్రంగా మారిందని ఆరోపించారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో లంచాలు తీసుకుంటూ పట్టుబడిన అధికారుల ఘటన కార్పొరేషన్‌లో అవినీతి తీవ్రతకు నిదర్శనమని పేర్కొన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

కార్పొరేషన్‌లో డీజిల్ వినియోగంలో భారీ అక్రమాలు జరుగుతున్నాయని, వినియోగంలో లేని వాహనాల పేరుతో డీజిల్ తీసుకుని దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై స్వతంత్ర సంస్థతో విచారణ జరిపి బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన పబ్లిక్ టాయిలెట్లు, షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్వహణను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని విమర్శించారు. ప్రజా సౌకర్యాలను పక్కనబెట్టి రాజకీయ ప్రయోజనాలకు ప్రజా ఆస్తులను వినియోగిస్తున్నారని ఆరోపించారు.

నగరంలో పారిశుద్ధ్య వ్యవస్థ పూర్తిగా దెబ్బతిందని, డ్రైనేజీలు శుభ్రం చేయకపోవడంతో మురుగు నీరు రోడ్లపైకి వస్తోందని, తాగునీటి సమస్యలు, వీధి దీపాలు వెలగకపోవడం, రోడ్ల దుస్థితి, పార్కుల నిర్వహణలో నిర్లక్ష్యం వంటి సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

ఖమ్మం కార్పొరేషన్‌లో జరుగుతున్న అన్ని అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన అధికారులు, ప్రజాప్రతినిధులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే నగర ప్రజలతో కలిసి మరింత ఉధృతంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తప్పట్లమూర్స్‌లో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి ఘనంగా నివాళులర్పించిన సర్పంచ్...



**గట్టు మండలం ఆగస్టు 6:** జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండలం తప్పట్ల మోర్స్ గ్రామంలో స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో తెలంగాణ సిద్ధాంతకర్త, ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ ఆశీర్వాదం ముఖ్య అతిథిగా హాజరై, జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా సర్పంచ్ ఆశీర్వాదం మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ చేసిన మేధోపరమైన పోరాటం, ప్రజల్లో రగిల్చిన ఉద్యమ స్ఫూర్తి చిరస్మరణీయమైనవని కొనియాడారు. తెలంగాణ సిద్ధాంతాన్ని ప్రతి ఒక్కరికీ చేరవేసి, ఉద్యమానికి దిశానిర్దేశం చేసిన మహనీయుడు జయశంకర్ సార్ అని గుర్తుచేశారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, యువత ఆయన ఆదర్శాలను స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది, స్థానిక నాయకులు, యువకులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయశంకర్ సార్‌కు అంజలి ఘటించారు.ం

## పోటీ పరీక్షల్లో సత్తా చాటిన గ్రామీణ యువతి: జడ్జి కావడమే ధ్యేయమన్న గార్లపాటి పుష్పలత



**చింతకాని (ఖమ్మం):సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**ఖమ్మం జిల్లా చింతకాని మండలం పాతర్లపాడు గ్రామానికి చెందిన గార్లపాటి పుష్పలత సీపీజీసెట్ (జూ+జజు) ప్రవేశ పరీక్షలో ఎంఎల్ఐఎస్సి (మీ×మూ౩) కోర్సు విభాగంలో 251వ ర్యాంకు సాధించి తన ప్రతిభను చాటుకున్నారు.

గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన పుష్పలత విద్యాభ్యాసంలో వరుస విజయాలు సాధిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈమె జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జీచీఖ) నుంచి ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగంలో బి.టెక్ (ఫస్ట్ క్లాస్), ప్రతిష్టాత్మక ఉస్మానియా విశ్వవిద్యాలయం (ూఖ) నుంచి ఎల్ఎల్‌బి (ఫస్ట్ క్లాస్) పూర్తి చేశారు, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాలో అడ్వకేట్‌గా నమోదు చేసుకున్నారు. హైదరాబాద్ లోని మెట్రోపాలిటన్ క్రిమినల్ కోర్టు లో న్యాయ వాడిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. 'ఆల్టర్నేటివ్ డిస్ప్యూట్ రిజల్యూషన్' (ూణ=) విభాగంలో ఎల్ఎల్ఎమ్ పట్టా పొందారు.

ఈ సందర్భంగా పుష్పలత మాట్లాడుతూ "గ్రామీణ, సామాజికంగా మరియు ఆర్థికంగా వెనుకబడిన ప్రజలు విద్య, ఉద్యోగాల ద్వారా మాత్రమే పేదరికం నుంచి బయటపడి అభివృద్ధి చెందగలరు. న్యాయశాస్త్రంలో డాక్టరేట్ (ొష్ట్రణ అఅ ూఖ౩) పూర్తి చేయడంతో పాటు భవిష్యత్తులో న్యాయమూర్తి (జడ్జి) అయి సమాజానికి నిస్వార్థ సేవలు అందించడమే నా జీవిత ఆశయం" అని తెలిపారు.

గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చి ఉన్నత విద్యా కోర్సుల్లో ప్రతిభ కనబరుస్తున్న పుష్పలతను పాతర్లపాడు ఉప సర్పంచ్ దారెల్లి సురేష్,గ్రామస్థులు, బంధుమిత్రులు మరియు స్థానిక ప్రజలు ఘనంగా అభినందించారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాల నాగులవంచలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి నిర్వహణ -- విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ





**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** చింతకాని : ప్రభుత్వ జూనియర్ కళాశాల నాగులవంచలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో తెలంగాణ సిద్ధాంతకర్త, ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ నవీన్ బాబు ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

అనంతరం కళాశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నవీన్ బాబు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. అదే విధంగా విద్యార్థులు అందించిన నోటు పుస్తకాలను సద్వినియోగం చేసుకుంటూ క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని, విద్యకు ప్రాధాన్యతనిస్తూ సమయాన్ని సక్రమంగా వినియోగించి ఉత్తమ ఫలితాలు సాధించి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ జి. మల్లయ్య, అధ్యాపకులు వరప్రసాద్, ఆయుబ్, శ్రీనివాసరావు, ఐలేశ్వర్, వేణుగోపాల్, ఉష, కళాశాల బోధన మరియు బోధనేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ స్వచ్ఛంద సేవకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అశోక్‌నగర్ కాలనీలో పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణ...

**వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: 11 వ వార్డు సభ్యురాలు భూక్యా సుశీల...**



**సి కె న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి ఆగస్టు 06,**
భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని అశోక్‌నగర్ కాలనీలో భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకటరావు, సర్పంచ్ పూనెం కృష్ణ సూచనల మేరకు 11వ వార్డు సభ్యురాలు భూక్యా సుశీల ఆధ్వర్యంలో గురువారం పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. డ్రైన్లలో పేరుకుపోయిన పూడిక తొలగింపు, కాలువల శుభ్రపరిచే పనులను చేపట్టించారు.

ఈ సందర్భంగా కాలనీలోని సమస్యలను స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో చెత్తాచెదారం పేరుకుపోకుండా గ్రామపంచాయతీ సిబ్బంది వచ్చే సమయంలో ట్రాలీ ఆటోలో వేయాలని, మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. దోమల వ్యాప్తి పెరిగే అవకాశం ఉన్నందున ఇంటి పరిసరాల్లో బ్లీచింగ్ చల్లుకోవాలని, జ్వరాల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

కాలనీలో వీధి దీపాలు వెలగకపోవడం, డ్రైన్లు నిండిపోవడం లేదా ఇతర సమస్యలు ఉన్నా నేరుగా తనను సంప్రదించాలని భూక్యా సుశీల తెలిపారు. త్వరలో ఎమ్మెల్యే నిధులు, సర్పంచ్ నిధులు, వార్డు సభ్యురాలి నిధులతో నూతన సీసీ రోడ్లు, సీసీ డ్రైన్ల నిర్మాణ పనులు చేపడతామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు.

## ఎమ్మార్పీఎస్ ఉద్యమ నేత గ్రామీణ వైద్యుడు కట్టా వెంకటేశ్వర్లు గుండెపోటుతో మృతి.



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** చింతకాని మండలం ప్రొద్దుటూరు గ్రామ సపరిచితులు మృదుస్వభావి ప్రముఖ ఆర్ఎంపి వైద్యులు శ్రీ కట్టా వెంకటేశ్వర్లు గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందటం చాలా బాధాకరం గ్రామ ప్రజలకు ఎంతో కలివిడిగా ఉంటూ అందరితో స్నేహ సంబంధం తో మెలిగిన వ్యక్తి ప్రొద్దుటూరు గ్రామం తోపాటు చుట్టుపక్కల చాలా గ్రామాలకు సుపరిచితులు గత 40 సంవత్సరముల నుంచి వైద్య వృత్తిలో ఎంతోమంది ప్రజల ప్రాణాలను కాపాడిన మహనీయుడు ఇతని ఆధ్వర్యంలో ఎంతోమంది కాంపౌండర్లుగా నేర్చుకొని ఈరోజు వైద్య వృత్తిలో ఒక స్థాయిలో ఉన్నారు డాక్టర్ కట్ట వెంకటేశ్వర్లుమృతితో ప్రొద్దుటూరు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి గ్రామ మొత్తం శోక సముద్రంలో మునిగి ఉన్నది అలాంటి మహనీయుని కోల్పోవడం చాలా బాధాకరం వారి కుటుంబానికి మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ శ్రీ కట్టా వెంకటేశ్వర్లు కి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని కోరుకుంటూ నివాళు లర్పిస్తున్నాము

# విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలే లక్ష్యం

### టిల్ ఫ్లవర్ సోల్జర్స్ టీమ్‌ను ప్రకటించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి




**సి కే న్యూస్, తొర్రూరు :** విద్యార్థుల్లో దేశభక్తి, క్రమశిక్షణ నాయకత్వ లక్షణాలు, సేవాభావాన్ని పెంపొందించే కార్యక్రమాలు భావి పౌరులను తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తాయని పాలకుర్తి ఎమ్మెల్యే శ్రీమతి మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. తొర్రూరు పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో గురువారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని లిటిల్ ఫ్లవర్ సోల్జర్స్ టీమ్‌ను ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు వ్యక్తిత్వ వికాసం, సామాజిక బాధ్యతలు, నాయకత్వ లక్షణాలను అలవర్చుకుని దేశానికి ఆదర్శ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. పాఠశాల యాజమాన్యం చేపట్టిన ఈ వినూత్న కార్యక్రమాన్ని అభినందించిన ఆమె, విద్యార్థుల సర్వతోముఖ అభివృద్ధికి దోహదపడే ఇటువంటి కార్యక్రమాలు నిరంతరం నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తూనం శ్రవణ్ కుమార్, వైస్ చైర్మన్ సోమా రజిని రాజశేఖర్, పట్టణ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.




శ్రీ పోచమ్మ దేవి అమ్మవారి ఆశీస్సులతో ప్రతి ఇంటా సుఖశాంతులు,ఆయురారోగ్యాలు,ఐశ్వర్యం వెల్లివిరియాలని,మన రాష్ట్రం మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని మనసారా కోరుకుంటున్నాను అని అన్నారు టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి జగదీశ్వర్ గౌడ్ గారు..

ఈరోజు హాఫీజ్ పెట్ డివిజన్ పరిధిలోని అంబేద్కర్ నగర్ బస్తీలోని శ్రీశ్రీశ్రీ పోచమ్మ దేవి పంచమి 5వ వార్షిక మహోత్సవము సందర్భంగా దేవాలయంలో నిర్వహించిన కళ్యాణ మహోత్సవంలో స్థానిక నాయకులు,ప్రజలతో కలిసి పాల్గొన్ని ప్రత్యేక పూజలు నిర్వహించారు శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి జగదీశ్వర్ గౌడ్ గారు..

ఈ కార్యక్రమంలో నాయకులు కనకమామిడి నరేందర్ గౌడ్,శేరిలింగంపల్లి నియోజకవర్గం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు లక్ష్మణ్ గుప్తా,పాండు ముదిరాజ్,దేవ,యలమంచి ఉదయ్ కిరణ్,హేమంత్ గౌడ్,బస్తీ అధ్యక్షులు కేశవ్,నాయకులు శోభన్,గోపాల్,యాదగిరి,సీతారాం,రాజు,నరేందర్,వినోద్ కుమార్,సాయినాథ్,జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు..

# రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్సీ ని దగా డీఎస్సీగా మార్చింది

**మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి**




**ధర్మవరం,ఆగస్టు 06 సి కె న్యూస్** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2025లో నిర్వహించిన మెగా డీఎస్సీ ని దగా డిఎస్సీగా మార్చింది అని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని తాసిల్దార్ కార్యాలయం ముందు బాగాన రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు రిలే నిరాహార దీక్షలను చేపట్టారు. ఈ సందర్భంగా కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ, అంతులేని అవినీతి అక్రమాలతో మెగా డీఎస్సీ జరగడం జరిగిందని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. లక్షలాదిమంది నిరుద్యోగుల భవిష్యత్తుతో ఆటలాడటం కూటమి ప్రభుత్వమునకు అలవాటైందని తెలిపారు. ఈ రిలే నిరాహార దీక్షలో వైఎస్ఆర్సిపి యువజన విభాగం, వివిధ విద్యార్థి విభాగాల ఆధ్వర్యంలో ఈ రిలే నిరాహార దీక్షలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఎన్డీఏ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే నిరుద్యోగులను తప్పుదోవ పట్టించిందని వారు దుయ్యబట్టారు. ఎన్డీఏ ప్రభుత్వం డీఎస్సీని అమ్ముకొని కోట్లాది రూపాయలను దండుకున్నదని వారు ఆరోపించారు. జీవో నెంబర్ 4 అండ్ 47 లను కొత్తగా తెచ్చి స్పోర్ట్స్ కోట్టాను రెండు శాతం నుండి మూడు శాతానికి పెంచి స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు గౌరవాధ్యక్షులు టిడిపి ఎమ్మెల్యేలు ఎంపీలను పెట్టి గందరగోళంగా సర్టిఫికెట్లను మంజూరు చేసిందని మండిపడ్డారు. అనహృవులకే ఉద్యోగాలను కట్టబెట్టడం జరిగిందని,ఇందుకు సాక్షదారులతో కూడా తాను చూపడం జరిగిందని తెలిపారు. కట్టుదిట్టమైన భారీ భద్రత నడుమ డీఎస్సీ ప్రశ్నాపత్రం డేటాను అవుట్సోర్సింగ్ సిబ్బందికి అప్పగించడం ఎంతవరకు సమంజసమని వారు ప్రభుత్వాన్ని నేరుగా ప్రశ్నించారు. బాధిత అభ్యర్థులు ఆధారాలతో సహా కోర్టుకు వెళ్ళినప్పటికీ ప్రభుత్వము అనుసరిస్తున్న నిర్లక్ష్యం అవినీతి అక్రమాలకు నిదర్శనమైందని తెలిపారు. తక్షణమే ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సిబిఐ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తన పదవికి రాజీనామా చేసి తీరాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుర్రం శ్రీనివాస్ రెడ్డి, వైఎస్సార్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు పురుషోత్తం,రాష్ట్ర అధికార ప్రతినిధి వేముల అమర్నాథ్ రెడ్డి,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాటిల్ శ్రీకాంత్ రెడ్డి, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు గడ్డం గంగాధర్ నాయుడు తో పాటు రేగాటిపల్లి అశోక్ రెడ్డి మదన్ మోహన్ ,రామ్మోహన్ రెడ్డి,ప్రవీణ్,అశోక్, ప్రతాపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాంజీ కాంస్య విగ్రహం ఆవిష్కరణ

**అనకాపల్లి, సి కె న్యూస్ ఆగస్ట్ 06:** పట్టణం, వాసవి మాత ముద్దు బిడ్డ, అజాత శత్రువు, స్నేహశీలి, మాజీ మున్సిపల్ చైర్మన్ కడ్మిశెట్టి శ్రీరాములు (రాంజీ) జయంతి సందర్భంగా పెరుగు బజార్, రాతి మేడ వద్ద కాంస్య విగ్రహం, వైశ్య యువజన సంఘం, కంచికా పరమేశ్వరి దేవాలయం అనకాపల్లి వారి ఆధ్వర్యంలో ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ చేతుల మీదుగా విగ్రహా ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ రాంజీ కేవలం ఒక రాజకీయ నాయకుడు మాత్రమే కాదు, ప్రజల మనిషి అన్నారు. కుల, మత, వర్గ, పార్టీ భేదాలకు అతీతంగా ప్రతి ఒక్కరినీ తన కుటుంబ సభ్యులుగా భావిస్తూ, స్నేహితుడిగా, తమ్ముడిగా, అన్నయ్యగా, అండగా నిలిచిన వ్యక్తి అని అందుకే ఆయన ప్రజల్లో ఎంతో మంచి పేరు, విశేష మైన ప్రజా సంబంధాలు ఉన్నాయన్నారు. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతూ, ప్రజా సేవకు తన జీవితాన్ని అంకితం చేశారు. ఇటువంటి నాయకులు సమాజానికి ఎంతో అవసరం అని, భవిష్యత్ నాయకత్వానికి రాంజీ ఒక ఆదర్శంగా నిలుస్తారని మనమందరం విశ్వసిస్తున్నాం. అలాగే, మహనీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములు ని ఈ సందర్భంగా స్మరించుకోవడం మన బాధ్యత. తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం, ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆయన చేసిన త్యాగం చిరస్మరణీయం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పీలా గోవిందు సత్యనారాయణ దంపతులు, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, టిడిపి రాష్ట్ర



కార్యనిర్వహణ కార్యదర్శి దాడి రత్నాకర్, కన్యకా పరమేశ్వరి సంఘం సభ్యులు, వైశ్య సంఘ నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు పాల్గొన్నారు.